www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 11 అక్టోబర్ 2024

వైఎస్ఆర్

వృద్ధాశ్రమాల్లో జడ్జి పరిశీలన

వృద్ధాశ్రమాన్ని పరిశీలిస్తున్న జడ్జి

ప్రజాశక్తి - కడప : నగరంలోని బృందా, చౌడమ్మ వృద్ధాశ్రమాలు, కొండాయపల్లెలోని మా అమ్మ ఒడి, వివేకానంద నగర్‌లో గల శక్తి సదన్‌లను, శిశు సంరక్షణలను గురువారం సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రెటరీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ పరిశీలించారు. అక్కడున్న వంటశాలను, వసతి గదులను, డైనింగ్ హాలును, స్టోర్ రూమ్‌ను, పరిసరాలను పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100, మొదలు అంశాలను వివరించారు, కార్యక్రమంలో నిర్వాహకులు, పిల్లలు, మహిళలు, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

నిలకడ లేని ధరలతో ఉల్లి రైతులు విలవిల

జడ్జిగారికొట్టాలు వద్ద అమ్మకానికి సిద్ధంగా ఉంచిన ఉల్లి పంట

- దళారులు చెప్పిందే రేటు
- తాడేపల్లి, చెన్నయ్ మార్కెట్లలో అధిక ధరలు
- శాశ్వత కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే రైతులకు ఉపయోగం

ప్రజాశక్తి-చాపాడు

ధరలు అమాంతం పెరిగి సామాన్య ప్రజలకు కన్నీటిని తెప్పిస్తున్న ఉల్లి ధరలు అటు సాగు చేస్తున్న రైతులకు కూడా ఇబ్బందికరంగానే మారాయి. అడపాదడప వర్షాల కారణంగా సాగుచేసిన పంట దెబ్బతినడంతో ఒకటికి రెండుసార్లు సాగు ఖర్చులు రైతు మీద పడుతున్నాయి. గతంలో 100 కిలోల విత్తనాల ధర రూ.45 నుంచి రూ.50 వేల లోపు మాత్రమే. ఈ ఏడాది విత్తనాల ధర రూ.65 వేలకు చేరుకొని రైతులకు ఆర్థిక భారమైంది. ఎకర సాగుకు ఖర్చు రూ.50 వేలు అవుతుండడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. జూన్, జులై నెలల్లో రూ.65 వేలు వెచ్చించి విత్తనాలు సేకరించి రైతులు సాగు చేపట్టారు. వర్షం సరిగా పడకపోవడంతో సాగు దెబ్బతన్నది. వర్షాలు లేక పంట దెబ్బతిని ఆర్థికంగా నష్టం ఏర్పడినప్పటికీ తిరిగి సాగుకు యత్నం చేపట్టారు. ఈ ఏడాది ధరలు సెప్టెంబర్ నెలలో క్వింటాలు రూ.3500 వరకు పలికాయి. ప్రస్తుతం క్వింటా 2800 వరకు మాత్రమే ధరలు పలుకుతున్నాయి. జిల్లాలో దువ్వూరు, మైదుకూరు, చాపాడు, ఖాజీపేట, తదితర ప్రాంతాల్లో నాలుగు వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. రైతులు కర్ణాటక ప్రాంతంలోని చిక్బులాపూర్, గోర్ బెద్దనూర్, నంద్యాల నుంచి విత్తనాలను సేకరించి సాగు చేపట్టారు. ప్రస్తుతం కర్ణాటక రకం క్వింటాల్ రూ.2800 వరకు పలుకుతున్నాయి. క్వింటాల్ రూ.6 వేల నుంచి రూ.8 వేల గిట్టుబాటు ధరలు ఉంటే రైతులు సాగు ఖర్చులు వచ్చే అవకాశం ఉంటుంది. దళారులు రోజుకో రేటును నిర్ణయిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు తాడేపల్లిగూడెం, చెన్నయ్ మార్కెట్లో ప్రస్తుతం క్వింటాలు రూ.40 వేలకు పైగా ధరలు పలుకుతుంటే మన ప్రాంతంలో మాత్రం రూ.3 వేలు లోపు మాత్రమే రైతులకు చెల్లిస్తున్నారు. అది కూడా వర్షం వచ్చినప్పుడు అమ్మకాలు చేపడితే ధరలు మరింత తగ్గిస్తున్నారు. మైదుకూరు ప్రాంతంలో శాశ్వత కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే సాగు మరింత పెరిగి రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండే అవకాశం ఏర్పడుతుంది. ఎన్నో ఏళ్లగా రైతులు ఉల్లి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నా అధికారులు ప్రజాప్రతినిధులు మాత్రం పట్టించుకోవడం లేదు. మార్కెట్లో మాత్రం ఉల్లి ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి.

ఎకరాకు రూ.50 వేల వరకూ ఖర్చులు

రెండు ఎకరాలలో ఉల్లి పంటను సాగు చేశా. నంద్యాల ప్రాంతంలో విత్తనాలను సేకరించి సాగు చేపట్టాం. ప్రస్తుతం పంట నూర్పిడి దశలో ఉంది. ధరలు చూస్తే అమాంతం తగ్గిపోతున్నాయి. ఎకరాకు రూ.50 వేల వరకు సాగు ఖర్చులు అయ్యాయి. శాశ్వత కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ధరలు నిలకడగా ఉండేలా చూడాలి.

- ప్రసాద్, రైతు, సిద్ధారెడ్డిపల్లె, చాపాడు మండలం.

గిట్టుబాటు ధరలు నిర్ణయిస్తే ఉపయోగం

ఉల్లి పంటకు సరైన గిట్టుబాటు ధరను నిర్ణయించకపోవడంతో దళారులు సూచించిన ధరలకు అమ్మకాలు చేయాల్సివస్తుంది. ప్రతి సంవత్సరం ఉల్లి పంటను సాగు చేసి తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. సాగు చేసే సమయంలో ధరలు ఒక మాదిరిగా దేవుడు వచ్చిన తర్వాత ధరలు వేరుగా ఉంటున్నాయి. ఇతర ప్రాంతాల్లో ధరలు అధికంగా ఉన్న మైదుకూరులో వ్యాపారులు తక్కువ కొనుగోలు చేస్తున్నారు. శాశ్వత కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.

- వీరయ్య, రైతు, మైదుకూరు.

ఇపిఎస్ పెన్షనర్లకు రూ.9 వేలు ఇవ్వాలి

- రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రామకృష్ణారెడ్డి

ధర్నాలో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

ఇపిఎస్ పెన్షనర్లకు రూ.9 వేలు పింఛను ఇవ్వాలని రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పిఎఫ్ ఆఫీస్ ఎదుట ఆల్ ఇండియా పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస పెన్షన్ రూ.9వేలు ఉండాలని పేర్కొన్నారు. రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులు జి.చంద్రమౌళి మాట్లాడుతూ పెన్షన్ బిక్ష కాదు అది మన హక్కు అన్నారు. వృద్ధాప్యంలో పెన్షన్ ఒక సామాజిక భద్రతని తెలిపారు. రిటైర్డ్ పెన్షనరులకు ఆరోగ్యశ్రీ, తెల్లరేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ ఆసుపత్రులలో వైద్య సేవలు కల్పించాలని కోరారు. రైల్వేలో సీనియర్ సిటిజన్స్ కు రాయితీలు కల్పించాలని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ధర్నాలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పిఎఫ్ ఆఫీసులో పెన్షన్ దారులు సాంకేతిక లోపాలతో అనేక ఇబ్బందులు పడుతున్నారని, పరిష్కరించమని వినతి పత్రాలు ఇచ్చిన ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన వృద్ధులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని చెప్పారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస పెన్షన్ రూ.9 వేలు కోసం రానున్న కాలంలో కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలను కలుపుకుని సమరశీలమైన ఆందోళన, పోరాటాలకు శ్రీకారం చుడతామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ధర్నాకు సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులురెడ్డి, ఎల్ఐసి కడప డివిజనల్ కార్యదర్శి ఎ.రఘునాథరెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు సగిలి గుర్రప్ప, జ్యోతి కెమికల్స్ ఫ్యాక్టరీ యూనియన్ నాయకుడు చెన్నకేశవరెడ్డి సంఘీభావం, మద్దతు ప్రకటించారు. ధర్నాలో ఆల్ పెన్షనర్స్ అండ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సిఆర్‌వి ప్రసాద్ రావు, ప్రజా సంఘాల నాయకులు దస్తగిరిరెడ్డి, నారాయణ, చంద్రారెడ్డి, దస్తగిరి, శ్రీకృష్ణదేవర, జిల్లాలోని పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న హరిప్రసాద్

మద్యం దుకాణాలపై అపోహలు నమ్మొద్దు : టిడిపి

ప్రజాశక్తి-కడప అర్బన్

మద్యం దుకాణాలపై వైసిపి నాయకుల అపోహలను వ్యాపారస్తులు నమ్మొద్దని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ పేర్కొన్నారు. గురువారం హరిటవర్స్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాపారస్తులకు భరోసా కల్పిస్తున్నారని పేర్కొన్నారు. గడువు పొడిగించడంతో ఊహించని రీతిలో దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ ఆదాయానికి కూటమి ఎమ్మెల్యేలు సిండికేట్‌గా గండి కొడుతున్నారన్నది అపోహ మాత్రమేనన్నారు. దరఖాస్తుల కట్టడి చేస్తే, వేలాది దరఖాస్తులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. నీతి, నిజాయితీకి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని చెప్పారు. కలెక్టర్, అధికారుల సమక్షంలో లాటరీ పద్ధతిలో మద్యం షాపులు దక్కించుకున్న వారిని తెలియపరుస్తారన్నారు. వైసిపి ప్రభుత్వం మద్యం ద్వారా రాబడిని చూసుకుని, ఎప్పుడు చూడని బ్రాండ్లను తెచ్చి, ప్రజా ఆరోగ్యాలను గుల్ల చేసిందని మండిపడ్డారు. సమావేశంలో గంధం ప్రసాద్, బండి బాబు, సత్య, అబ్బిశెట్టి వెంకటేష్, అమీర్, కాసిం పాల్గొన్నారు.

వైవీయూ రిజిస్ట్రార్‌ను తొలగించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగివేమన విశ్వ విద్యాలయంలో లైంగిక ఆరోపణలు కలిగి, అదీ నిజమని తెలిసి కమిటీ రిపోర్టు ఇచ్చిన కామాంధుడు రాంప్రసాద్‌రెడ్డిని రిజిస్ట్రార్‌గా నియమించడం దారుణమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దు రాహుల్, వీరపోగు రవి అన్నారు. గురువారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 2011 సంవత్సరంలో తెలుగు శాఖ డిపార్ట్మెంట్లో తన పిహెచ్‌డి స్కాలర్‌ను, మహిళలను వేధింపులు గురి చేసారనే ఆరోపణతో యూనివర్సిటీ కమిటీ వేసిందని తెలిపారు. ఆ కమిటీ నిజమేనని నిర్ధారించిందని చెప్పారు. వైవీయూ కమిటీ క్రమ శిక్షణ చర్యల్లో భాగంగా మూడేళ్ల పాటు ఎటువంటి పిహెచ్‌డి స్కాలర్ మహిళని నియమించిన కూడదని, రెండు నెలల ఇంక్రిమెంట్‌ను కూడా కట్ చేశారని చెప్పారు. అటువంటి వ్యక్తిని మళ్ళీ ఇప్పుడు రిజిస్ట్రార్‌గా నియమించడమంటే విద్యా ప్రమాణాలకు తూట్లు పొడవడమేనన్నారు. ప్రభుత్వం ఇంకెవ్వరూ లేరు అన్నట్లు ఇటువంటి లైంగిక ఆరోపణలు కలిగిన వ్యక్తి ని రిజిస్ట్రార్ గా నియమించడం దారుణమని పేర్కొన్నారు. పేరు, పలుకుబడితో అక్రమ దారులలో పదవుల అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే రిజిస్ట్రార్ రాంప్రసాద్ రెడ్డిని తొలగించాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అజయ్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-కడప అర్బన్ : నూతన మద్యం పాలసీ, దుకాణాల టెండర్ల ప్రక్రియ, లాటరీ నిర్వహణ పై ఆసక్తి ఉన్నవారి నుంచి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్ తెలిపారు. గురువారం ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మద్యం దుకాణాల నిర్వహణ కోసం ఆఫ్లైన్ ఆన్లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరి స్తున్నామని పేర్కొన్నారు. కడప జిల్లాలో 139 షాపులు, అన్నమయ్య జిల్లాలో 111 షాపుల కొరకు మద్యం లాటరీ నిర్వహించడం కోసం దరఖాస్తుల స్వీకరిస్తున్నామని చెప్పారు. దరఖాస్తులు ఆఫ్‌లైన్, ఆన్లైన్ మోడ్లో ఇంట్లోనే కూర్చుని అప్లై చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులు నెట్ సెంటర్లు, ప్రొవిజన్ ఎక్సైజ్ శాఖ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. నెట్టులో దరఖాస్తుకు అవసరమైన అన్ని అంశాలు ఉన్నాయని తెలిపారు. పారదర్శకంగా ప్రక్రియ కొనసాగుతూ ఉందని చెప్పారు. ఆన్లైన్లో, బ్యాంకు ద్వారా ఫీజు చెల్లించవచ్చని చెప్పారు. పూర్తి చేసిన దరఖాస్తు తో పాటు పాస్ కూడా వస్తుందని పేర్కొన్నారు. దానిని తీసుకుని టెండర్ ఓపెన్‌కు హాజరుకావాలని తెలిపారు. జడ్పీ కార్యాలయంలో టెండర్లు ఓపెన్ చేస్తామని చెప్పారు. కలెక్టర్ సమక్షంలో మొత్తం కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తు గొడుగు ఈనెల 11వ తేదీ వరకు ఉందని తెలిపారు. 14వ తేదీ లాటరీ తీస్తామని చెప్పారు. కడప జిల్లా నుంచి 2225 దరఖాస్తులు స్వీకరించామని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో 1392 దరఖాస్తుల స్వీకరించామని తెలిపారు. దరఖాస్తుకు ఇంకా అవకాశం ఉంది కావున సంఖ్య పెరిగేందుకు వీలుందని చెప్పారు. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో ఎక్సైజ్ సిఐలు పాల్గొన్నారు.

ఆచార్య శంకర్ పరిశోధన పత్రంకు గుర్తింపు

ప్రజాశక్తి-కడప అర్బన్ : యుకెలోని ప్రతిష్టాత్మకమైన పరిశోధక కోపసిడెక్స్ జర్నల్ 'కెమ్కామ్'లో ఆరు దశాబ్దాల కాలంలో ప్రచురితమైన పరిశోధన పత్రాలలో అత్యుత్తమమైన వాటిని ఎంపిక చేయగా అందులో వైవీయూ మెటీరియల్ సైన్స్ అండ్ నానో టెక్నాలజీ ఆచార్యులు ఎం.వి.శంకర్ రాసిన పరిశోధన పత్రం ఉత్తమమైనదిగా నిలిచి ప్రత్యేక గుర్తింపు లభించింది. కెమ్కామ్ జర్నల్ 60వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని భారతదేశ నుంచి వెలువడిన పరిశోధన పత్రాలను ఎంపిక చేయగా అందులో వైవీయూ ఆచార్యుడికి చోటు లభించింది. 2013, ఆగస్టు 15న వైవీయూ, సిఎస్ఐఆర్-ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసిటి), హైదరాబాద్ మధ్య సహకారంతో ప్రచురితమైంది. యుకె రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ కెమికల్ కమ్యూనికేషన్ జర్నల్ వారు శంకర్, బృందాన్ని ప్రశంసిస్తూ మెయిల్ ద్వారా సమాచారాన్ని పంపారు. ఆచార్య శంకర్ 2020, 2021, 2022, 2023 సంవత్సరాల్లో 'మెటీరియల్స్, ఎనర్జీ' రంగంలో ప్రపంచంలోని టాప్ 2 శాతం అత్యంత ప్రభావవంతమైన శాస్త్రవేత్తలలో నిలిచిన విషయం తెలిసిందే. నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆఫ్ కొరియా (2024) ద్వారా అత్యుత్తమ విదేశీ పరిశోధకులకు అందించే బ్రెయిన్ పూల్ ఫెలోషిప్ ఇటీవలే సొంతం చేసుకున్నారు. యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.రామప్రసాదరెడ్డి, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి, మెటీరియల్ సైన్స్అండ్‌నానో టెక్నాలజీ విభాగాధిపతి బి.విజయ కుమార్‌నాయుడు శంకర్‌ను అభినందించారు.

ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కరించాలి : కలెక్టర్

కలసపాడు : అంగన్వాడీ కేంద్రం వద్ద మురుగును పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్

ప్రజాశక్తి-కలసపాడు (కాశినాయన)

ప్రజల సమస్యలు తెలుపుకుని తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. గ్రామోదయం కార్యక్రమంలో భాగంగా గురువారం కలసపాడు మండలంలోని ఎగువ రామాపురంలో మార్నింగ్ వాక్ నిర్వహించిన కలెక్టర్ మండల, గ్రామ స్థాయి అధికారులతో కలిసి గ్రామంలోని అన్ని వీధులు కలియ తిరుగుతూ స్థానికుల సామాజిక ఆర్థిక స్థితిగతులను ప్రత్యక్షంగా పరిశీలించారు. గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో యాక్టివిటీస్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామంలో వీధి రోడ్లు, స్మశానం, డ్రెయినేజీ, తాగునీటి సరఫరా, విద్యుత్, హౌసింగ్, పెన్షన్ పథకాలకు సంబంధించిన సమస్యలపై నేరుగా ప్రజలతో మాట్లాడి తెలుసుకున్న కలెక్టర్ తన దృష్టికి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులకు తెలిపి తక్షణమే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రామానికి సంబంధించిన అన్ని రకాల సమస్యలపై చర్చించి తర్వాత గ్రామ పర్యటనకు వచ్చేలోగా సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి, తహశీల్దార్ మధురవాణి, సర్పంచ్ వెంకటయ్య, పంచాయతీ సెక్రెటరీ సృజన, విఆర్వో కల్ నాయక్, మెడికల్ ఆఫీసర్ శైలజ, సీడీపీవో లక్ష్మీ, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. **వల్లూరు** :ప్రజల సమస్యలు తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని మండల స్థాయి అధికారులను జెసి అతిధి సింగ్ ఆదేశించారు. వల్లూరు గ్రామ పంచాయతీలో మండల అధికారులతో కలిసి మార్నింగ్ వర్క్ నిర్వహించారు. గ్రామంలోని అన్ని వీధులు తిరుగుతూ స్థానికుల సామాజిక ఆర్థిక స్థితిగతులను ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రఘురాం, తహశీల్దార్ శ్రీవాణి, పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాసులు, మండల టిడిపి ఇన్‌ఛార్జి లేబాక నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. **కాశినాయన** : గ్రామోదయం ప్రజల అవసరాలు తీర్చిదిందుకే ఏర్పాటు చేశారని మండల ప్రత్యేక అధికారి నరసింహారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గంగనపల్లిలో గ్రామోదయం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటసుబ్బయ్య, ఎఒ సీతారామిరెడ్డి, గ్రామ పంచాయితీ సెక్రెటరీ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కృష్ణవేణి

సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణవేణి

ప్రజాశక్తి - కడప

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కృష్ణవేణి అన్నారు. గురువారం ఆర్‌టిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ, రోడ్డు రవాణా శాఖ ఆదాయం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రాయలసీమ జోన్ సమీక్ష సమావేశంలో అధికారులకు దిశా, నిర్దేశం చేసినట్లు చెప్పారు. రోడ్డు భద్రత నిబంధనలను కొనసాగిస్తూనే రవాణా శాఖలో పన్నుల వసూలుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కువ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ స్టాప్ అండ్ వాష్ అండ్ గో రెస్ట్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. హెచ్చరికల బోర్డులను కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. గువ్వల చెరువు ఘాట్‌కు ఇరుపక్కల స్టాప్ అండ్ వాష్ అండ్ గో రెస్ట్ రూములు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ దసరా సీజన్లో ప్రైవేటు బస్సులలో అధిక చార్జీలు వసూలు చేయకుండా దాడులు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో బయటి వ్యక్తుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా విధి నిర్వహణ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. దళారులతో సంబంధం లేకుండా ప్రజలే నేరుగా రవాణా శాఖ కార్యాలయానికి వచ్చి తమ పనులు పూర్తి చేసుకోవచ్చు అని తెలిపారు. ఎవరైనా దళారులు ఎదురైతే ఆర్టిఏ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. విలేకరుల సమావేశంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

తనీశ్వర్ ద్విశతకం..ఆధిక్యంలో చిత్తూరు

ద్విశతకం చేసిన తనీశ్వర్

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్-14 ప్లేట్ గ్రూప్ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా గురువారం ఎసిఎ స్టేడియంలో చిత్తూరు, ప్రకాశం జట్ల మధ్య మ్యాచ్ ప్రారం భమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 90.0 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 407 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఆ జట్టులోని తనీశ్వర్ టెండూల్కర్ డబుల్ సెంచరీ (206 పరుగులు) చేశాడు. మరో బ్యాట్స్మెన్ కెవిఎస్ మణిదీప్ 102 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ప్రకాశం జట్టులోని లోకేష్ 2, దినేష్ 2 వికెట్లు తీసుకున్నారు.

హోరాహోరీగా కడప, ఈస్ట్ గోదావరి మ్యాచ్ : కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప, ఈస్ట్ గోదావరి జట్ల మధ్య హోరీహోరీగా మ్యాచ్ సాగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఈస్ట్ గోదావరి జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 38.3 ఓవర్లలో 151 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని కృష్ణ సాకేత్ రెడ్డి 37, షేక్ 23 పరుగులు చేశారు. కడప జట్టులోని హితేష్ సాయి అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. ఆదిత్య 3 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 49.0 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. ఆ జట్టులోని యోగాంజనేయ 50, సాయి కృష? చైతన్య 35 (నాట్ అవుట్) పరుగులు చేశారు. ఈస్ట్ గోదావరి దత్తులోని తమన్ మూడు వికెట్లు తీసుకున్నాడు.

63 పరుగులకే కుప్ప కూలిన కర్నూలు : కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో కర్నూలు, విశాఖపట్నం జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 32.3 ఓవర్లలో 63 పరుగులకే అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని మోక్షజ్ఞ రెడ్డి 27 పరుగులు చేసి నాట్ అవుట్‌గా నిలుచారు. విశాఖపట్నం జట్టులోని పి.వినోద్ 5, భాను స్వరూప్ 2, వర్మ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన విశాఖపట్నం జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 58.0 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 295 పరుగులు చేసింది. ఆ జట్టులోని తమన్ రెడ్డి 82, ప్రణవ్ శ్రీరామ్ సెంచరీ (103 పరుగులు) చేసి నాటౌట్‌గా నిలిచాడు. విజయ్ కుమార్ 78 (నాటౌట్) పరుగులు చేశాడు.

'ఉక్కు' ఏర్పాటయ్యే వరకూ ఉద్యమం

ప్రజాశక్తి-కడప అర్బన్ : దేశంలో, రాష్ట్రంలో రాజకీయ ప్రత్యామ్నాయ శక్తిగా అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అవతరిస్తుందని, నేతాజీ సుభాష్ చంద్ర బోస్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వి.సుందరరామరాజు పిలుపునిచ్చారు. గురువారం ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జయ వర్ధన్ అధ్యక్షతన కడప నగరంలోని ఐఎంఎ హాల్‌లో అఖిలభారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో ప్రొద్దుటూరుకి చెందిన ఒంటెద్దు ప్రదీప్‌రెడ్డిని పార్టీలోకి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుందర రామరాజు మాట్లాడుతూ ఒంటెద్దు ప్రదీప్ రెడ్డి రాకతో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాయలసీమ వ్యాప్తంగా బలోపేతం అవుతుందని తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు పోరాటం ముందుండి నడుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని పరిపాలించిన ముఖ్యమంత్రులలో ఎక్కువ మంది రాయలసీమ వాసులై ఉండి కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు చిత్తశుద్ధితో పనిచేయ లేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందుతున్నారని వాపోయారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు మూడు ప్రదేశాలలో శంకుస్థాపనలు చేసి కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని వృధా చేయడం తప్ప, నిరుద్యోగుల పట్ల, కడప జిల్లా అభివృద్ధి పట్ల ఎటువంటి ప్రేమ లేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో కేవలం ఓట్లు దండుకోవడానికి ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చి తీరా అధికారం లేక వచ్చాక పరిశ్రమ ఉసే లేకుండా పోతుందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బీరం సుభాష్ చంద్రరెడ్డి, అగ్రగామి మహిళా సమితి రాష్ట్ర కార్యదర్శిలు కోటపాటి సుబ్బమ్మ, హిమబిందు, డాక్టర్ జి.వి.సుబ్బయ్య, పృథ్వి, పోతులయ్య పాల్గొన్నారు.

వసతి గృహాల్లో జడ్జి గాయత్రి తనిఖీ

ప్రజాశక్తి - సిద్ధవటం: మండల కేంద్రమైన సిద్ధవటంలోని బిసి బాలుర, బాలికల వసతి గృహాలను గురువారం సిద్ధవటం కోర్టు ఇన్‌ఛార్జి జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి అకస్మిక తనికి చేశారు బిసి బాలుర విద్యార్థుల గదులను స్టోర్ గదిని, డైనింగ్ హాల్ వంట రూము, టాయిలెట్ గదులు ఆఫీసులోని పలు రికార్డులు పరిశీలించారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వులు మేరకు తాను సిద్ధవటంలోని బాలుర, బాలికల వసతి గృహాలను తనిఖీ చేశానని తెలిపారు. విద్యార్థుల గదుల్లో ఫ్యాన్సు కొరతగా ఉన్నాయని కిటికీలకు రెక్కలు పూర్తిగా దెబ్బతిన్నాయని టాయిలెట్, బాత్రూం గదుల తలుపులు సరిగా లేవని వసతి గృహం అధికారి ప్రసాద్‌ను ప్రశ్నించారు. బడ్జెట్ మంజూరైన వెంటనే అన్ని వసతులు చేయిస్తానని హాస్టల్ వార్డెన్ ప్రసాద్ తెలియజేశారు. బాలుర వసతి గృహం పరిశుభ్రంగా ఉంచడం, పలు రికార్డులు సక్రమంగా ఉండడం వల్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడితోనే బిపి, షుగర్ : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి కడప అర్బన్

మానసిక ఒత్తిడితో బిపి, షుగర్ వ్యాధులు వస్తాయని డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు అన్నారు. గురువారం ప్రపంచ మానసిక ఆరోగ్యంపై అవగాహన వారోత్సవాలలో భాగంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా అక్టోబర్ 10 వ తేదీన అంతర్జాతీయ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహిస్తూ ఉన్నామని తెలిపారు. మానసిక ఒత్తిడి, ఆందోళన వలన చిన్న వయసులోనే అధిక రక్తపోటు, మధుమేహం, గుండెపోటు వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. యోగా, శారీరక వ్యాయామం, సమయపాలన ద్వారా అధిగమించవచ్చని పేర్కొన్నారు. జిల్లా మానసిక ఆరోగ్య వైద్య నిపుణురాలు డాక్టర్ కవిత ప్రసన్న మాట్లాడుతూ ఉద్యోగస్తులు ఎక్కువగా ఒత్తిడికి గురవుతున్నారని, వారు పనిచేసే సామర్థ్యం, ఉత్పాదకత దెబ్బతింటుందని చెప్పారు. పరోక్షంగా ఇది దేశ ఆర్థికస్థితిపై ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు. ఒత్తిడిని, మానసిక రుగ్మతలను తొలిదశలోనే గుర్తించి కౌన్సెలింగ్, సరైన వైద్యం ద్వారా నయం చేయవచ్చని తెలిపారు. ఎన్‌సిడి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ మానసిక ఆరోగ్యానికి సంబంధించి జిల్లాలో 6 మంది సభ్యులతో కూడిన మెంటల్ హెల్త్ టీం పని చేస్తుందని చెప్పారు. ఎటువంటి మానసిక సమస్యల నైన గుర్తించిన, లేక మీరే ఆ సమస్యలతో బాధపడుతూ ఉన్న మెంటల్ హెల్త్ టీం ని ఏ సమయంలో ఐనా సంప్రదించవచ్చని పేర్కొన్నారు. మానసిక ఆరోగ్యం కొరకు కేంద్ర ప్రభుత్వం ప్రజలకోసం టెలిమానస్ అనే టోల్ ఫ్రీ నంబర్ 14416 ద్వారా టెలికౌన్సిలింగ్ సేవలు పొందవచ్చని తెలిపారు. ఈ సదుపాయాన్ని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని కోరారు. సమావేశంలో డిఐఒ డాక్టర్ ఉమామహేశ్వర్ కుమార్, డిఎల్ఎటివో డాక్టర్ రవిబాబు, అర్బన్ హెల్త్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఉబేదుల్లా, నవీన్, మెంటల్ హెల్త్ టీమ్ సభ్యులు రాధిక, శిల్పా, భాస్కర్, సుమన్ బాబు, పవన్, అర్బన్ హెల్త్ సెంటర్స్ మెడికల్ ఆఫీసర్స్, డిఎంహెచ్ఒ కార్యాలయ సిబ్బంది, సిహెచ్ఒలు, ఎఎన్ఎం పాల్గొన్నారు.

పరీక్షల నియంత్రణాధికారిగా రామకృష్ణ నియామకం



ప్రజాశక్తి-కడప

కడప ప్రభుత్వ పురుషుల కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా డాక్టర్ పి.రామకృష్ణ నియమితులయ్యారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ పురుషుల కళా శాలలో జియాలజీ లెక్చరర్‌గా పనిచేస్తున్న రామకృష్ణను నియమించారు. గతంలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కె.ఎ.జమాల్ బాషా కంట్రోలర్ ఆఫ్ ఎక్జామినేషన్స్‌గా బాధ్యతలు నిర్వర్తించే వారు. ఆయన స్థానంలో ఈనెల 10వ తేదీ నుండి ఆ బాధ్యతలను 2026వ సంవత్సరం అక్టోబర్ నెల 10వ తేదీ వరకు (రెండు సంవత్సరాల పాటు) నిర్వర్తించనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచి కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ గా బాధ్యతలు అప్పగించిన ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సక్రమంగా తన బాధ్యతలను నిర్వహిస్తానని చెప్పారు.

సమస్యలు తెలుసుకుంటున్న ఆర్‌డిఒ ప్రత్యూష

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ఉద్దేశమని ఆర్‌డిఒ ప్రత్యూష పేర్కొన్నారు. గ్రామోదయం, నగరోదయం కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణ పరిధిలోని ఎర్రగుడిపల్లెలో ఆమె ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. హౌసింగ్, డ్రయినేజీ, రోడ్లు, పారిశుధ్యం గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కమిషనర్ రాముడు, సిడిపిఒ శ్రీలత, హౌసింగ్ డిఇ రమణారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముద్దనూరు : గ్రామ, ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం గ్రామోదయం కార్యక్రమం చేపట్టినట్లు మండల ప్రత్యేక అధికారి చాముండేశ్వరి, ఎంపిడిఒ ముకుందరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని 5వ వార్డులో గురువారం వివిధ శాఖల మండల అధికారులు గ్రామోదయం మార్నింగ్ వాక్ కార్యక్రమం నిర్వహించారు. వీధి దీపాలు, విద్యుత్ స్తంభాలు, రోడ్లు ఏర్పాటు చేయాలని ప్రజలు అధికారులను కోరారు. అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పాలు, గుడ్ల సరఫరాపై ఆరా తీశారు. డిఎన్ పల్లె సమీపంలో ఉన్న చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ వరద కిషోర్‌రెడ్డి, విద్యుత్ ఎఇ శ్రీనివాస రాజవర్మ, ఈఓపిఆర్డీ వీర భద్రుడు, పీఆర్ ఎఇ వినయ్‌కుమార్, విఆర్ఒ రాజశేఖర్, అంగన్వాడీ సూపర్‌వైజర్ ఉమారాణి పాల్గొన్నారు.

మరమ్మతులకు గురైన చేతి పంపును పరిశీలిస్తున్న అధికారులు

మరమ్మతులు చేయించడంలో నిర్లక్ష్యం తగదు

- అంగన్వాడీకి సరఫరా చేసే సరుకులపై ప్రత్యేకాధికారి విజయలక్ష్మి అసంతృప్తి

ప్రజాశక్తి - చాపాడు

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా చేతి పంపులను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి అధికారులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని భద్రిపల్లి గ్రామంలో ఉషోదయం కార్యక్రమంలో భాగంగా మండలస్థాయి అధికారులతో కలిసి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా టిడిపి యువ నాయకుడు, సర్పంచ్ భర్త వీర నారాయణ యాదవ్ చేతిపంపులను మరమ్మతులు చేయాలని, గత నాలుగు నెలలుగా కోరుతున్నా సంబంధిత సిబ్బంది స్పందించడం లేదని ఫిర్యాదు చేశారు. వెంటనే చేతి పంపులు మరమ్మత్తులు చేపట్టాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మహమ్మద్‌కు సూచించారు. మురుగు కాలువలు కూడా చాలా అధ్వానంగా ఉన్నాయని, వెంటనే పూడికతీత పనులు చేపట్టాలన్నారు. ఘన వ్యర్థ పదార్థాలు కాలువలో వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసే పాలు, గ్రుడ్డు నాణ్యతపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. కోడి గుడ్డు పరిమాణం చాలా తక్కువగా ఉందన్నారు. పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉండడం లేదని సిబ్బంది అధికారుల దృష్టికి తెచ్చారు. అంగన్వాడీ పిల్లలతో కలిసి పౌష్టికాహారాన్ని తిన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ రామకుమారి, ఈఓపిఆర్డీ రాధాకృష్ణవేణి, వెలుగు ఏపీఎం శ్రీధర్, ఉపాధి ఏపీఓ జగదీశ్వర్ రెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు శుభరత్నమ్మ, రాజ్యలక్ష్మి, సిహెచ్ఓ మహదేవ్ యాదవ్, ఆరోగ్య విస్తరణ అధికారి రాఘవయ్య, సూపర్వైజర్లు సరస్వతి బాబుల్‌రెడ్డి పిహెచ్ఎన్ సుకన్య, కమ్యూనిటీ హెల్త్ సిబ్బంది శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగి మృతికి నాయకులు సంతాపం

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాజీపేట అగ్రహారానికి చెందిన మామిళ్ల వెంకటకృష్ణయ్య (58) కర్నూలు కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఆయన పాణ్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఆయన మృతి పట్ల నాయకులు విచారం వ్యక్తం చేశారు. గురువారం అగ్రహారంలో మృతుని కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులను పలువురు ఓదార్చారు. టిడిపి రాష్ట్ర ముస్లిం మైనారిటీ కార్యనిర్వాహక కార్యదర్శి సిద్దారం ఖదీరుల్లా, కలసపాటి రవిప్రకాష్, నారాయణ రావు, నాయకులు శివకుమార్, ఖలీల్ నివాళులు అర్పించారు. **రెడ్యం సంతాపం :** మామిళ్ల వెంకటకృష్ణయ్య మృతికి వైసిపి నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. గురువారం అగ్రహారంలో మృతుడి కుటుంబాన్ని ఎపిఎస్ఆర్‌టిసి మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకట సుబ్బారెడ్డి పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

క్రైం కార్నర్

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి - అట్లూరు

నవీన్ (ఫైల్‌ఫొటో)

మండలంలోని వేమలూరుకు చెందిన నడివీధి నవీన్(21) బుధవారం రాత్రి కనుమలోపల్లి సమీపంలో రైలుపట్టాలు మీద పడుకొని ఆత్మహత్మకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. నవీన్ కడపలో ట్రావెల్స్ సహాయకుడిగా పనిచేస్తున్నాడు. బుధవారం యధావిధిగా ఇంటి నుంచి వెళ్లిన నవీన్ ట్రావెల్సకు వెళ్లకుండా కనుమలోపల్లి వద్ద దిగి రైలుపట్టాలపై పడి మృతి చెందాడు. రైల్వే పోలీసులు నవీన్ ఆత్మహత్య విషయాన్ని గ్రామానికి తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు నవీన్ మృతితో తల్లితండ్రులు ఈశ్వరమ్మ, బ్రహ్మయ్య కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆత్మహత్యకు కారణాలపై స్పష్టత లేక ఉత్కంఠ నెలకొంది. బాధిత కుటుంబాన్ని గురువారం ఎమ్మెల్యే సుధ రిమ్స్‌కు వెళ్లి పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

పెన్నాలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - సిద్ధవటం

సిద్ధవటంలో లెవెల్ వంతెన దగ్గర బుధవారం కడప బీడీ కాలనీ చెందిన వ్యక్తి జేమ్స్(28) పెన్నా నదిలో గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అదేరోజు విస్తృత గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం ఉదయం ఒంటిమిట్ట సిఐ కృష్ణంరాజు నాయక్ పరవేక్షణలో పెన్నా నదిలో గజ ఈతగాళ్ల సాయంతో నీటిలో దిగి పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టగా, సమీపంలో ఉన్న కంప చెట్టు దగ్గర జేమ్స్ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని బయటకు తీశారు. జేమ్స్ బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఒంటిమిట్ట సిఐ మాట్లాడుతూ లో కాజ్ వే వద్ద రహదారికి ఇరువైపులా పెన్నా నది పరిసర ప్రాంతాలకు వెళ్లకుండా రోడ్డు పూర్తిగా బ్లాక్ చేశామని, అవగాహన లేకుండా పెన్నా నదిలోకి ఎవరు దిగకూడదని హెచ్చరించారు. కొత్త వ్యక్తులు ఎవరైనా కూడా ఆ ప్రాంతాల్లో ఉంటే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని మండల ప్రజలను కోరారు.

యథేచ్ఛగా భూ ఆక్రమణలు

భూముల ధరలకు రెక్కలు - పట్టని రెవెన్యూ అధికారులు - పేదోడికి పంచడానికిలేని భూములు

ప్రజాశక్తి - వేముల

వేముల మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం 2004-2009 మధ్య రాష్ట్రంలో అప్పటి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల కోసం ప్రభుత్వ భూములను కేటాయించారు. అయితే ఆ భూములను నేడు కొంతమంది ఆక్రమించేందుకు యత్నిస్తున్నారు. మండలంలో భూ అక్రమణలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో కబ్జాదారుల ఉత్సాహం ఎక్కువైంది. ఇందులో భాగంగా కడప-పులివెందుల ప్రధాన రహదారికి సమీపంలో ఉన్న కృపానగర్ క్రాస్ నుంచి కుప్పగుట్టపల్లి గ్రామానికి వెళ్లే దారిలోని గుట్టను చదును చేసి సాగుకు సిద్ధం చేశారు. ఈ భూములకు భారీగా ధర పలుకుతోంది. ప్రభుత్వం గుట్టలను డికెటిలుగా పంచింది. తమ వ్యవసాయ పొలాలకు గుట్టల నుంచి సారవంతమైన మట్టి తోలుకోవాలంటే గుట్టలలో డికెటిలు తీసుకున్న వారు అడ్డుపడుతుండంతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ గుట్టలలో మిగిలిపోయి ఉన్న కొద్ది ప్రభుత్వ భూములను ఇష్టానుసారంగా అక్రమార్కులు చదును చేసి సాగు చేస్తున్నారు. పొలాలకు ఎక్కడి నుంచి మట్టి తోలుకోవాలని రైతులు ప్రశ్నిస్తున్నప్పటికీ ఆక్రమణదారులు మాత్రం వెనకడుగు వేయడంలేదు. దాదాపు 15 ఎకరాల వరకు గుట్టను ఆక్రమణదారులు సాగు చేస్తుంటే.. నిత్యం అదే రహదారిలో తిరిగే రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏదైనా చిన్నపాటి అవసరానికి రైతులు చెరువుల్లో, గుట్టల్లోగాని మట్టి తోలుకోవాలంటే రెవెన్యూ అధికారులు అనుమతి కావాలంటూ రైతుల ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఇంత పెద్ద ఎత్తున ఆక్రమణదారులు ప్రభుత్వ భూములను కొల్లగొడుతుంటే రెవెన్యూ అధికారులకూ మాత్రం కన పడకపోవడం దారుణం. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు వెంటనే ప్రభుత్వ భూముల ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. మండల పరిధిలో పలు గ్రామాల్లో కొందరు డికెటి భూములను తమకు కేటాయించిన దాంతో తృప్తి చెందకుండా, అత్యాశతో పక్కనున్న డికెటి భూములను చదును చేసి ఇది తమదేనంటున్నారు. దాదాపు 2009 సంవత్సరం కాలం నుండి నేటి వరకు ఎక్కడా కూడా భూములు లేని అణగారిన వర్గాలకు భూములు పంచేందుకు కూడా మండల పరిధిలో భూమిలేదని చెబుతున్న అధికారులు. ఆక్రమణదారులకు మాత్రం ఈ విషయంలో లోటు లేదని చెప్పుకోవాలి.

ఆక్రమణదారులు చదును చేసి సాగుకు సిద్ధం చేసిన భూమి

ఉత్సుకతను పెంపొందించడమే జెవివి లక్ష్యం

మాట్లాడుతున్న డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మానవుని సహజ లక్షణమైన ఉత్సుకతను పెంపొందించడమే జెవివి లక్ష్యమని జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ అన్నారు. జెవివి ఆధ్వర్యంలో ఈనెల 10,11,12 తేదీల్లో రాష్ట్ర స్థాయి యూత్ మీట్ ప్రొద్దుటూరు జెవివి కార్యాలయంలో గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన పతాకావిష్కరణతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గేయానంద్ మాట్లాడుతూ సమాజం, కుటుంబం, పాఠశాలలు నేడు విద్యార్థుల్లోని ఆ ఉత్సుకతను నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దాన్ని పెంపొందించడమే లక్ష్యంగా జెవివి పనిచేస్తోందన్నారు. ప్రజలు భ్రమల్లో కాకుండా భౌతికమైన వాస్తవాలతో బతకాలని అన్నారు. ప్రస్తుత కార్పొరేట్ సమాజంలో నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. దీనికి పరిష్కారం కనుగొనడంలో యువత ముందుకు రావాలని ఆయన పిలుపు నిచ్చారు. జీవ పరిణామ క్రమంలోని ముఖ్య అంశాలను వివరించారు. జెవివి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ సామాజికంగా మద్యపానం వల్ల నష్టాలు జరుగుతున్నాయని, వీటిని ప్రజల్లో ప్రచారం చేయాలని సూచించారు. విద్యార్థులు-ప్రస్తుతం సమాజం గురించి చర్చలు జరిపారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర నాయకులు తవ్వా సురేష్, జీలానిబాషా పాల్గొన్నారు.

అసైన్‌మెంట్ లబ్ధిదారులకు భూములు చూపాలి

తహశీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండల పరిధిలోని అసైన్‌మెంట్ లబ్ధిదారులకు భూములను సర్వే చేసి భూములు చూపాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.శివకుమార్ కోరారు. ఆ మేరకు సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం తహశీల్దార్‌కు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా జి. శివకుమార్ మాట్లాడుతూ 17ఏళ్ల క్రితం భూ పంపిణీలో భాగంగా అప్పటి ప్రభుత్వం అసైన్‌మెంట్ కమిటీ ద్వారా పంపిణీ చేసిన పట్టాలకు ఇంతవరకు భూములు చూపలేదన్నారు. లబ్ధిదారులకు దక్కాల్సిన భూములు మండలంలోని నరసన్నపల్లె, సోమిరెడ్డిపల్లె, రేకలకుంట, పరుగురాళ్లపల్లె, నేలటూరు, ముడుమాల, పాపిరెడ్డిపల్లె తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆక్రమణకు గురయ్యాయని తెలిపారు. ఆక్రమించిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమిరెడ్డిపల్లె రెవెన్యూ పొలం 1397 సర్వేనెంబర్‌లో నరసన్నపల్లె, బ్రహ్మంగారిమఠం ఎస్సీ, బిసి, ఓసిలకు చెందిన భూమిలేని పేదలకు పట్టాల మంజూరు చేశారని, వారికి పాస్ పుస్తకాలను మంజూరు చేసి ఆన్‌లైన్ చేయలేదన్నారు. పేదల భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని వెంటనే అధికారులు చర్యలు తీసుకొని నిజమైన అసైన్‌మెంట్ కమిటీ లబ్ధిదారులకు భూములు చూపాలన్నారు. మిగులు భూములు ఆ ప్రాంతంలోని దళితులు, బీసీలకు పంపిణీ చేయాలని కోరారు. ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ భూసమస్యల పైన ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు గండి సునీల్‌కుమార్, ఎర్రవల్లి అజయ్‌కుమార్, కలివెలి రాజశేఖర్, దేవ, సోమిరెడ్డిపల్లె అరవింద్, మురతోటి ప్రదీప్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించని బస్సులు

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయచోటి - వేంపల్లె మార్గాన ఆర్‌టిసి బస్సులు సమయపాలన పాటించకపోవడం పట్ల ఆయా గ్రామాల ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. వయా రాయచోటి నుంచి లక్కిరెడ్డిపల్లె, నాగల గట్టుపల్లె, చక్రాయపేట, గండి మీదుగా వేంపల్లె వరకు నడిచే ఆర్‌టిసి బస్సులు ఒకేసారి నాలుగైదు రైలు పెట్టెల్లా వస్తుంటాయి. అన్ని బస్సులు ఒకేసారి వెళ్లిపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. బస్సుల కోసం గంటల తరబడి వారు ఎదురుచూడాల్సిన పరిస్థితి. రాయచోటి - వేంపల్లె మధ్య రోడ్డు సరిగా లేకపోవడం, ఆలస్యంగా రావాలి కానీ ఒకేసారి వరుసగా రావడం ఏమిటి అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై బస్సు డ్రైవర్లను అడిగినప్పటికీ వారి పనితీరు మారడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పలుమార్లు ఆర్‌టిసి డిఎంకు ఫోన్‌లో చెప్పినా ఫలితంలేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై గతంలో అనేకసార్లు డ్రైవర్లపై ప్రయాణికులు దాడి చేయడం కూడా జరిగింది. వాటిపై కేసులు కూడా నమోదు అయిన విషయం అం దరికి తెలిసిందే. అయినా అధికారుల్లో ఏ మాత్రం మార్పు కనిపించడంలేదు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని సక్రమంగా ఆర్‌టిసి బస్సులను ఒక క్రమ పద్ధతిలో నడిచేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చక్రాయపేటలో బస్సుల టైమింగ్ పరిశీలిస్తున్న డిఎం ధనుంజయ

ఇకపై సమయానికి బస్సులు వస్తాయి : డిఎం

ఆర్‌టిసి డిపో మేనేజరు తంగేళ్ల ధనుంజయను సమస్యపై గురువారం వివరణ కోరగా.. ఈ రహదారిన బస్సులు సక్రమంగా నడవడం లేదనే మాట వాస్తవమేనన్నారు. రోడ్డు ఆధునికీకరణ పనులు వల్ల కొంత ఆలస్యం అవుతుందన్నారు. చాలాసార్లు ప్రయాణికులు తెలిపారని, మార్గమధ్యలో లక్కిరెడ్డిపల్లె, నాగలగట్టుపల్లె, చక్రాయపేట, వేంపల్లిలో ట్రాఫిక్ సూపర్ వైజర్లను ఏర్పాటు చేశామన్నారు.

రక్తదానం చేస్తున్న హెచ్‌డిఎఫ్ బ్యాంకు మేనేజర్ అంకిరెడ్డి

రక్తదానంతో ప్రాణదాతలు కండి

- సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు

ప్రజాశక్తి - వేంపల్లె

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి అని సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు పేర్కొన్నారు. అపదలో ఉన్న వారికి ఇతరులు చేసిన రక్తదానం వల్ల ప్రాణాలను కాపాడువచ్చని తెలిపారు. స్థానిక ఆర్ఎంఎస్ వీధిలో బోగా పార్వతమ్మ బ్లడ్ సెంటర్ సహకారంతో ఎంజి గ్రీన్ బ్యూటీ టెండర్స్ అధినేత మదార్ షావలి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన యువతకు పండ్లు, జ్యూస్, సర్టిఫికెట్లును సర్పంచ్ అందజేశారు. రక్తదానం చేసేందుకు వేంపల్లెలోని హెచ్‌డిఎఫ్ బ్యాంకు సిబ్బంది స్వచ్ఛందగా రావడం సంతోషకరమన్నారు. రక్తదాన శిబిరం ఏర్పాటుకు బోగ పార్వతమ్మ సిబ్బంది సహకారం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ షబ్బీర్‌వలి, రక్తదాన శిబిరం నిర్వాహకుడు మదార్ షా వలి, ఖాన్ కా రిస్తా సభ్యుడు సమీర్, వైసీపీ మైనార్టీ నాయకుడు సాదక్ వలి, హెచ్‌డిఎఫ్ బ్రాంచ్ మేనేజర్ శిరిగిరెడ్డి అంకిరెడ్డి, షఫివుల్లా, సుబ్బారెడ్డి, రూక ప్రసాద్‌రెడ్డి, వైసిపి నేత ఆది నారాయణరెడ్డి, మునీర్, బోగ పార్వతమ్మ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు

ప్రజాశక్తి - ముద్దనూరు : మండలంలోని వివిధ గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూములపై జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలని కలెక్టర్ శివశంకర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇన్‌ఛార్జి తహశీల్దార్ వరద కిషోర్‌రెడ్డి తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఉప్పలూరు, కొలవలి, బొందలకుంట, ముద్దనూరు, కొసినేపల్లె గ్రామాల్లోని ప్రభుత్వ భూములను ముద్దనూరు సబ్ రిజిస్టర్ కార్యాలయం ఇన్‌ఛార్జి సబ్ రిజిస్టర్ జి.మృణాళినిదేవి విధులు నిర్వహించిన సమయంలో అక్రమ రిజిస్ట్రేషన్లు జరిపినట్లు ఉన్నతాధికారులు గుర్తించి రద్దు చేయాలని ఆదేశించారన్నారు.

ధరలు తగ్గించడంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్ : నిత్యావసర సరుకుల ధరలను తగ్గించడంలో ప్రభుత్వం విఫలమైందని పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, వైసిపి నాయకులు పేర్కొన్నారు. పులివెందుల మార్కెట్ వద్ద గురువారం వారు పెరిగిన ధరలకు నిరసన కార్యక్రమాన్ని చేప ట్టా రు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో ఏమీ కొన లేం.. తినలేం.. అన్నట్లుగా ప్రజలు ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో సామాన్య ప్రజలు ఎవరు బతకలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ధరలను తగ్గించకపోతే నిరసన కార్యక్రమాలను చేపడ తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్. వాల్మీకి సంఘం నాయకులు నారాయణస్వామి, కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్, ఖాదం్‌బాషా, కో-ఆప్షన్ చంద్రమౌళి. డేనియల్, ఓతురు రసూల్ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న వైసిపి నాయకులు

సంఘసేవకుడు కంటి రాజును సన్మానిస్తున్న తులసిరెడ్డి

కంటి చూపు ప్రధానం

ప్రజాశక్తి - వేంపల్లె

కంటి చూపును కోల్పోతే జీవితం అంధకారమేనని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా కాపాడుకోవాలని పిసిసి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా పులివెందులకు చెందిన ప్రముఖ సంఘ సేవకుడు కంటి రాజును తులసిరెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ కంటి రాజును సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. కంటి చూపు బాగా ఉండాలంటే మనం తీసుకునే ఆహారంలో విటమిన్ ఎ సమృద్ధిగా ఉండాలని సూచించారు. బ్రతికున్నంతకాలం కంటి చూపును కాపాడుకోవాలని.. చనిపోయాక నేత్రదానం చేసి అంధులకు కంటిచూపును ప్రసాదించాలన్నారు. సంఘసేవకుడు కంటి రాజు పేదవాడు అయినప్పటికీ నేత్రదానాన్ని, రక్త దానాన్ని ఒక ఉద్యమంగా చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, ధృవ కుమార్‌రెడ్డి, రామకృష్ణ, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, బాలం సుబ్బరాయుడు, ఆరుసేర్ల సుబ్బరాయుడు, వేమయ్య, వేమారాజా, బద్రి, వెంకటేష్, మాష్, నాగరాజు, రవి, వినయ్ పాల్గొన్నారు.

రతన్ టాటా మృతి బాధాకరం

పారిశ్రామిక దిగ్గజం, ప్రముఖ సంఘ సేవకుడు, పద్మ విభూషణ్ రతన్ టాటా మృతి బాధాకరమని పిసిసి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. నవభారత నిర్మాణంలో రతన్ టాటా పాత్ర ప్రశంసనీయమన్నారు. దాతృత్వంలో దాన కర్ణుడు, నీతికి, నిజాయితీకి, నిరాడంబరతకు నిలువెత్తు నిదర్శనమన్నారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శం, అనుసరణీయం, స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

భూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతా

ప్రజాశక్తి - ఖాజీపేట

తహశీల్దార్ మహబూబ్ బాషా

భూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని కొత్తగా ఖాజీపేట తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన మహబూబ్ బాషా తెలిపారు. ఆ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ అధికారులకు, రైతులకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ప్రజాపంపిణీ వ్యవస్థ మెరుగ్గా ఉండేందుకు ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటానని ఆయన పేర్కొన్నారు. కార్యాలయ సిబ్బంది స్నేహ పూర్వకంగా ఉండాలని విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కలసపాడు నుంచి మహబూబ్ బాషా బదిలీలో ఖాజీపేటకు వచ్చారు.

ముద్దనూరు-1 విఆర్‌ఒగా రాజశేఖర్

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు సచివాలయం-1 విఆర్‌ఒగా జి.రాజశేఖర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఎర్రగుంట్ల మండలం లోని తుమ్మలపల్లి గ్రామం నుండి బదిలీపై ఇక్కడికి వచ్చారు. అనంతరం విఆర్ఒ మాట్లాడుతూ సచివాలయం పరిధిలోని ప్రజలకు,రైతులకు నిత్యం అందుబాటులో ఉంటానన్నారు.రెవెన్యూ శాఖకు సంబంధించి ప్రజలకు, రైతులకు అవసరమైన పత్రాలను అందించేందుకు కషి చేస్తానన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

తహశీల్దార్ నాగేశ్వరరావు

మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ జివి నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం ఆయన సింహాద్రిపురం తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. కడప కలెక్టరేట్ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న గుర్రప్పను కొండాపురం మండలానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా భూ సమస్యలు, తదితర వాటిపై దృష్టి సారిస్తామన్నారు. నిత్యవసర సరుకులు పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ముందుగా డిప్యూటీ తహశీల్దార్ హరిబాబు, సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

గర్భిణులకు అన్నం వడ్డిస్తున్న ఆర్‌సిడిఎస్ సభ్యులు

గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

ప్రజాశక్తి - కొండాపురం

గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ జాతీయ అధ్యక్షులు ఒంటెద్దు రామలింగారెడ్డి సూచించారు. కొండాపురం ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం గర్భిణులకు ఒంటెద్దు రామలింగారెడ్డి ఆధ్వర్యంలో పౌష్టికాహారం ఏర్పాటు చేశారు. ప్రతినెల వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు ఆర్‌సిడిఎస్ దాతల సాయంతో భోజనం ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం దాత అన్నమయ్య జిల్లా టి.సుండుపల్లి మండలం పెద్దినేని కాలువకు చెందిన సెలెబరోన్ ఐటి సంస్థ అధినేత ఎర్రపురెడ్డి రవిప్రకాశ్ రెడ్డి సహకారంతో పౌష్టికాహార భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సుజాత, సీనియర్ అసిస్టెంట్ నారాయణరెడ్డి, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్మోహన్‌రెడ్డి, అనంతపురం నారాయణరెడ్డి (బాబు), కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డిఎస్‌పిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల డిఎస్‌పి మురళి నాయక్‌ను గురువారం పులివెందుల కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మూలంరెడ్డి ధ్రువకుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలి శారు. ఈ సందర్భంగా డిఎస్‌పిని ఘనంగా సన్మానించారు. అనంతరం పులివెందుల నియోజక వర్గంలోని సమస్యలను వారు చర్చించారు. ప్రజా సమస్యలు ఏవైనా ఉంటే మీ దృష్టికి తీసుకొస్తామని ధ్రువకుమార్‌రెడ్డి ఆయనను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అమర్ నాథ్‌రెడ్డి, వంశీ, అనిల్ పాల్గొన్నారు.

ఒరిజినల్ డాక్యుమెంట్స్ పోయినవి

పోసా వరలక్ష్మి, భర్త పోసా వెంకటసుబ్బయ్య, డోర్‌నెం. 10/221, రవీంద్రనగర్, కడప సిటి, వైఎస్ఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్ అయిన నా యొక్క ఇంటి డాక్యమెంట్ నెం.1794/1999 Locked at Porumamilla, Main Road, Door No.12/16(12-154) Registered at Sub Registar, Badvel, 30.12.1999 ఒరిజినల్ రిజిస్టర్డ్ డాక్యుమెంట్స్ 05.09.2024వ తేది నేను రైతుబజారు, నియర్ జడ్పి ఆఫీస్ వెళ్ళుచున్నప్పుడు మిస్ అయినవి. కావున ఈ డాక్యుమెంట్స్ దొరికినవారు పై అడ్రస్సులో కాని ఈ క్రింది నెంబరుకు తెలియజేసినచో తగిన పారితోషికం ఇవ్వబడును.

సెల్: 7095046146 పోసా వరలక్ష్మి.